సాక్షి ఆదిలాబాద్

శనివారం, 9, డిసెంబర్, 2023



అతివాడకం అనర్థమే..

ఆన్‌లైన్, సోషల్‌మీడియా, ఇంటర్‌నెట్ విని యోగం మితిమీరితే మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థులు, యువత తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. 8లో▸

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. డీఎం కల్పన పాల్గొని ప్రయాణికులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
26.0 /17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

కార్మికుల వేతనాలు చెల్లించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ శైలజను కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సేవలతో స్వచ్ఛ అవార్డుతో పాటు ప్రశంసలు అందుకున్న బల్దియా అధికారులు కార్మికుల వేతనాల చెల్లింపును విస్మరించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో సీపీఐ పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

బెల్లంపల్లి: సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ డెప్యూటీ సెక్రెటరీ వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈలో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 17గురుకులాల విద్యార్థుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఆదిలాబాద్ రీజియన్ రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని ప్రశంసించారు. వంద శాతం ఉత్తీర్ణతను ఈసారి కూడా సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల సమన్వయ అధికారులు బాల భాస్కర్, బాలరాజు, శ్రీనివాస్, 17గురుకులాల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు మెరుగైన చికిత్స అందించాలంటే ముందుగా విషయ పరిజ్ఞానం అవసరం అని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో పీజీ వైద్యులకు శుక్రవారం ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. విధి నిర్వహణ, వృత్తిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేర్చుకున్న అంశాలను పాటించి మంచి వైద్యులుగా రాణించాలని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన



తాంసి: మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా చేపట్టారు. సుందర చైతన్య సత్సంగ్ ఆధ్వర్యంలో భక్తులు ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు సతీశ్ మంత్రోచ్ఛరణ నడుమ వేకువజామున విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్సంగ్ కమిటీ సభ్యులు స్వామిరెడ్డి, భూమన్న, వెంకట్ రెడ్డి, అశోక్, సర్పంచ్ కృష్ణ, వీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఫ్రీ జర్నీ..

- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం
- నేటి నుంచి 'మహాలక్ష్మి' పథకం ద్వారా..
- మధ్యాహ్నం నుంచి అమలులోకి..
- మార్గదర్శకాలు జారీ



బస్సు ఎక్కుతున్న మహిళలు

ఆదిలాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. శనివారం నుంచి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ల్లో వయసుతో సంబంధం లేకుండా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఫ్రీ జర్నీ సౌకర్యం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభించనున్నారు. తదనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా రోజుకు సుమారు మూడు లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తుండగా, అందులో 50 శాతం మేర మహిళలే ఉంటారని అంచనా. దీంతో వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

రీజియన్ స్వరూపం ఇలా...

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఉట్నూర్, భైంసా డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో పల్లె వెలుగు బస్సులు 385, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 102 ఉన్నాయి. మొత్తంగా రీజియన్ వ్యాప్తంగా 487 సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించనున్నారు. రీజియన్ వ్యాప్తంగా రోజుకు 1,50,000 మంది మహిళా ప్రయాణికులకు లబ్ధి చేకూరే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఓఆర్ పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఉచిత ప్రయాణమిలా...

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో తెలంగాణ పరిధి లోపల మహిళలు ఎంత దూరమైనా ప్రయాణించవచ్చు. ఇందుకోసం ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్ బుక్ వంటివి ఏవైనా ప్రభుత్వ ధ్రువీకరించిన గుర్తింపు పత్రాలను కండక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. త్వరలోనే జీరో టికెట్ ఇష్యూ చేసేలా మార్గదర్శకాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. అంత వరకు ఈ గుర్తింపు పత్రాలను పరిగణలోనికి తీసుకొని మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా ఆర్టీసీ సిబ్బంది సహకరించాలని అధికారులు వారికి సూచిస్తున్నారు.

అంతరాష్ట్ర సర్వీసుల్లో ఇలా..

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అటు వైపు వెళ్లే ప్రయాణికులకు ఉచిత ప్రయాణం వెసులుబాటు విషయంలో అధికారులు సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. రీజియన్ పరిధి నుంచి మహారాష్ట్ర బార్డర్ వరకు ఉచిత ప్రయాణం వెసులుబాటు ఉంటుందని, సరిహద్దు దాటిన అనంతరం టారిఫ్ ప్రకారం చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన బేల మండలం శంకర్ గూడా, జైనథ్ మండలం డొల్లారా, ఆనందపూర్, తాంసి మండలం అందర్ బంద్, భీంపూర్ మండలం కరంజి, తలమడుగు మండలం లక్ష్మీపూర్, బోథ్ మండలం ఘన్‌పూర్ వరకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది.

అసౌకర్యం కలగకుండా చర్యలు..



శనివారం మధ్యాహ్నం నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్య పథకం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. రద్దీగా ఉండే ప్రాంతాల్లో నియంత్రణ అధికారులు సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తున్నాం. ఉద్యోగులు, సిబ్బంది సైతం మహిళా ప్రయాణికులతో హుందాగా, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచిస్తున్నాం.

– సోలోమన్, ఆర్టీసీ ఆర్ఎం

మాకెంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడం మంచి విషయం. గతంలో పాస్‌లు ఉన్నప్పటికీ ఇబ్బందికరంగా ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ప్రయాణించడం వలన డబ్బులు ఆదా అవుతాయి. విద్యార్థినులకు ఈ పథకం ఎంతగానో మేలు చేస్తుంది.

– లావణ్య, గోముత్రి, భీంపూర్

నెలకు రూ.4వేలు ఆదా



నేను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మాది నేరడిగొండ మండలం తర్లం గ్రామం. ప్రతిరోజు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటా. రానుపోను రూ.140 వరకు చార్జీలయ్యేది. నెలకు రూ.4వేల వరకు ఖర్చు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం వలన మాలాంటి వారికి ఎంతగానో దోహదపడుతుంది.

– వనిత, తర్లం

పొగమంచు కమ్మేస్తోంది



పొగమంచు కారణంగా లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు

- వాహనదారుల ఇబ్బందులు
- వీడని మిచాంగ్ ప్రభావం

ఆదిలాబాద్‌టౌన్: మిచాంగ్ తుపాను ప్రభావం జిల్లాను వీడటం లేదు. మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భానుడు మేఘాల చాటునుంచి బయటకు రావడం లేదు. దీంతో జనం చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నమైనప్పటికీ శీతల గాలుల తీవ్రత తగ్గకపోవడంతో వృద్ధులు, దీర్ఘకాలిక, శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ జిల్లా అంటేనే భిన్నమైన వాతావరణానికి నెలవు. అత్యధిక వర్షాలు, తీవ్రమైన ఎండలు, ఎముకలు కొరికే చలి జిల్లాలో నమోదవుతుంది. గతేడాది కనిష్ఠ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలకు పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉండే అవకాశాలున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి తోడూ మిచాంగ్ ప్రభావం జిల్లా వాసులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఉదయం పనులకు వెళ్లే పారిశుధ్య కార్మికులు, పాల వ్యాపారులు, పేపర్ బాయ్‌లు అవస్థలు పడుతున్నారు. కాగా శుక్రవారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 16.7 డిగ్రీలకు పడిపోయింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 25.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

దట్టమైన పొగమంచు

జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామునుంచి దట్టమైన పొగమంచు కమ్ముకుంది. పక్కనున్న వారు కూడా కనిపించని పరిస్థితి. గ్రామాలు, పట్టణంలో ఉదయం 9గంటల వరకు, అలాగే జాతీయ రహదారి, అటవీ ప్రాంతంలో మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. ఫలితంగా ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు కనిపించకపోవడంతో వాహనాల లైట్ల వెలుతురులో నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా చలి ప్రభావంతో ప్రజలు చలిమంటలు కాగుతూ కనిపించారు. చాలా మంది అవసరముంటే తప్ప బయటకు వెళ్లడం లేదు. ఎక్కువగా ఇళ్లకే పరిమితమవుతున్నారు.

కందిపై తుపాను ప్రభావం

మిచాంగ్ తుపాను రైతులను తీవ్ర నష్టానికి గురిచేస్తోంది. అక్కడక్కడ కురుస్తున్న వర్షం కారణంగా పత్తి పంట దెబ్బతినగా కాత దశకు వచ్చిన కంది పంటకు సైతం నష్టాన్ని కలిగిస్తోంది. పూత రాలిపోతోంది. కంది కొమ్మలన్ని నేలకు వంగిపోతున్నాయి. ఖరీఫ్‌లో అధిక వర్షాలతో పత్తి, సోయా పంటలు దెబ్బతినగా చేతికంద వచ్చిన కంది సైతం తుపాను ప్రభావంతో రైతులను కంటతడి పెట్టిస్తోంది.

అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు

ఆదిలాబాద్: అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నివాసంలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు శుక్రవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎంతగానో పోరాటం చేశామన్నారు. అలాగే తన విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞుడిగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్లు ఫర, గౌరీ, అంగన్‌వాడీలు రాధ, విజయ, జయశ్రీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేశ్, తదితరులున్నారు.

జిల్లాను దత్తత తీసుకోవాలి

- సీఎం తన హామీ నెరవేర్చాలి
- ఆదివాసీల హక్కులు కాపాడాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపీ 'సోయం' లేఖ



ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని ఎంపీ సోయం బాపూరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి శుక్రవారం లేఖ రాశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కొలువుదీరిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా వాసులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలన్నారు. ఆదివాసీల హక్కులు కాపాడాలని, అలాగే పోడు భూములకు పట్టాలు పూర్తిస్థాయిలో అందించి చట్టాలను సంరక్షించాల్సిన బాధ్యత సీఎంపై ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌ఓసీ మంజూరు చేయాలని కోరారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అలాగే బోథ్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, కుప్టి ప్రాజెక్టు మంజూరు వంటి హామీలను . నిలబెట్టుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

టీఎన్జీవోస్ సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడాన్ని స్వాగతిస్తూ టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం నాయకులు, ఉద్యోగులు మిఠాయిలు పంచి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వానికి ఉద్యోగులు అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల్‌రెడ్డి, గోపి, రాజేశ్వర్, చంద్రమోహన్‌రెడ్డి, సంతోష్, మాణిక్, నర్సింలు, సుజాత ,ఆరతి, లక్ష్మి, రజిత, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ.. ఇక్కట్లు!

- ఈనెల 31 లోపు వివరాలు సమర్పించాలి
- లేకుంటే గ్యాస్ కనెక్షన్ రద్దు
- ఆయిల్ కంపెనీల ఉత్తర్వులు
- ఏజెన్సీల ఎదుట లబ్ధిదారుల బారులు

గ్యాస్ కనెక్షన్లు
ఉజ్వల : 36,098
జనరల్ : 1,39,085, దీపం : 40,701



ఇండియన్ ఆయిల్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులు తీరిన మహిళలు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా అందజేసిన ఉజ్వల వంట గ్యాస్ కనెక్షన్ మనుగడలో ఉండాలంటే ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేస్తూ ఆయిల్ కంపెనీలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 31లోపు ఈకేవైసీ వివరాలు సమర్పించకుంటే కనెక్షన్ రద్దవుతుందనే హెచ్చరికల నేపథ్యంలో ఉజ్వల లబ్ధిదారులు జిల్లాలోని సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ఈకేవైసీ వివరాల నమోదు జరుగుతుండగా వేలాది మంది లబ్ధిదారులు హాజరవుతున్నారు. సాయంత్రం వరకు నిరీక్షించినా తమవంతు రాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. సంబంధిత పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం దీనిపై తమకెలాంటి సంబంధం లేదని చేతులెత్తేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఉద్దేశమేంటి..

దారిద్ర్యరేఖకు దిగువనున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కట్టెలపొయ్యిపై చేసే వంటతో వచ్చే పొగ కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారని భావించిన కేంద్ర ప్రభుత్వం వారికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై) స్కీం కింద ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా ఈ స్కీం మే 2016లో ప్రారంభం కాగా తెలంగాణలో 14 ఏప్రిల్, 2018 నుంచి అమలు చేశారు. అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌తో పాటు సిలిండర్ అందజేశారు. జిల్లాలో ఈ పథకం కింద 36,098 మంది లబ్ధి పొందారు. ఇంకా వేలాది సంఖ్యలో దరఖాస్తులు ఏజెన్సీలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఏజెన్సీల ఎదుట బారులు

ఉజ్వల లబ్ధిదారులు ఈ నెల 31లోపు ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకోవాలని లేని పక్షంలో వారి కనెక్షన్లు రద్దు చేస్తామని పేర్కొంటూ ఆయిల్ కంపెనీలు ఉత్తర్వులు జారీ చేశాయి. దీంతో కనెక్షన్ ఎక్కడ రద్దవుతుందనే ఉద్దేశంతో తమ వివరాలు అందించేందుకు మహిళా లబ్ధిదారులు ఆయా ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్లుగా భారీగా తరలివస్తున్నారు. ఉదయం 9గంటలకే చేరుకుని సాయంత్రం ఐదు గంటల వరకు నిరీక్షిస్తున్నారు. వేలిముద్రలు, ఫేస్ రికగ్నైజేషన్, ఐరీస్ ద్వారా ఏజెన్సీలు లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నాయి. రోజుకు 300 నుంచి 500 వరకు లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నట్లుగా ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే లబ్ధిదారులు భారీగా తరలివస్తుండడంతో గంటల తరబడి వేచి ఉన్నా తమ వంతు రాకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అయితే ఇప్పటి వరకు తమకెలాంటి ఉత్తర్వులు రాలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం.



బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు

ఉజ్వల లబ్ధిదారులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలంటూ అధికారికంగా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఆయిల్ కంపెనీలు సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేసినట్లుగా మాత్రమే మాకు సమాచారమంది. వారు ఎలాంటి వివరాలు సేకరిస్తున్నారు, ఎప్పటి వరకు గడువుందనే వివరాలు మాత్రం తెలియదు. కాగా, ఈకేవైసీ కోసం వచ్చే లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఏజెన్సీలదే.

– కిరణ్ కుమార్, డీఎస్ఓ

క్లుప్తంగా

ప్రజాదర్బార్‌లో తాంసివాసి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న విద్యాధర్

తాంసి: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు మొట్టె విద్యాధర్ తనకు ఉపాధి నిమిత్తం రుణం అందించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం విన్నవించాడు. జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశాడు. కొన్నేళ్ల క్రితం ప్రమాదంలో చేయి కోల్పోయి దివ్యాంగుడిగా మారానని, తనకు రుణం అందించి ఆదుకోవాలని కోరాడు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు విద్యాధర్ తెలిపాడు.

ముగిసిన టెన్నీకాయిట్ ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే

సోన్: మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ ఎంపిక పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి వై.వి.రమణరావు తెలిపారు. అండర్-17బాలుర విభాగంలో యం.జోనాధన్, అజయ్, విఘ్నేష్, వెంకటేష్, రాహుల్, రాజ్ కుమార్. అండర్-17 బాలికల విభాగంలో యం.నిఖిత, ప్రణవి, స్పందన, అక్షిత, శ్రావణి, రామలక్ష్మి. అండర్-14 బాలుర విభాగంలో కె.సిద్ధార్థ, సాయికుమార్, దీపక్, అన్వేష్, మణికంఠ, నవకిశోర్. అండర్-14 బాలికల విభాగంలో సంధ్య, చైత్ర, మల్లీశ్వరి, శ్రీవర్షిని, హరిచందన, సంజన రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.భోజన్న, నఫేఖాన్, వెంకటేష్, వెన్నెల, అన్నపూర్ణ, జమునా, లక్ష్మి, భూమన్న, రవీందర్‌గౌడ్, మధుసూదన్ ఉన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



పుష్పగుచ్ఛం ఇస్తున్న రేఖానాయక్ దంపతులు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాం నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెనుకబడ్డ ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

అతివాడకం అనర్థమే..!

- ఆన్‌లైన్, సోషల్‌మీడియా, ఇంటర్‌నెట్ వినియోగంపై హెచ్చరికలు
- మితిమీరితే మానసిక, శారీరక సమస్యలు
- తీవ్ర ఒత్తిడి, డిప్రెషన్‌లో విద్యార్థులు, యువత..
- మానసిక సమస్యలకు మూలమిదే...

జిల్లా కేంద్రానికి చెందిన ఓ పదో తరగతి విద్యార్థి బాగా చదువుతున్నాడని తల్లిదండ్రులు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి ఇచ్చారు. చదువుల్లో ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకుంటాడని ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా కల్పించారు. ఎప్పుడూ కంప్యూటర్‌పై బిజీగా ఉంటున్న తమ కొడుకును చూసి ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు. ఓ రోజు కొడుకు ఏమి చేస్తున్నాడని అకస్మాత్తుగా దగ్గరికి వెళ్లి చూస్తే ఫేస్‌బుక్‌లో అసభ్యకర చిత్రాలతో ఉన్న గుర్తు తెలియని వారితో చాట్ చేస్తుండటాన్ని చూసి అవాక్కయ్యారు. ఇలా పలువురు విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు.



నిర్మల్‌ఖిల్లా: మొత్తం ప్రపంచమే అరచేతి మునివేళ్లపై.. అన్నట్లుగా మారిపోయింది ప్రస్తుత పరిస్థితి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి వ్యక్తి ఇంటర్‌నెట్, సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లను విరివిగా వాడటం సర్వసాధారణమైపోయింది. దీంతో ఎన్ని ప్రయోజనాలున్నాయో... అంతకుమించి అనర్థాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాల్లో సైతం ఆన్‌లైన్ చదువులు, వర్క్ ఫ్రం హోం, ఉద్యోగ అవకాశాలు, కాలక్షేపం కోసం పిల్లలు, పెద్దలు, గృహిణుల సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు, యువత సోషల్ మీడియా వినియోగానికి బానిసలుగా మారుతున్నారు.

సెల్‌ఫోన్‌లకు బానిసగా మారి..

ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఫోన్ల వాడకం ప్రస్తుతం అధికమైంది. రకరకాల యాప్స్‌తో నిత్యం వాటిపైనే కాలక్షేపం చేస్తున్నాం. వాట్సాప్, యుట్యూబ్, ఫేస్‌బుక్‌లలో కాలక్రమేణ అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. తల్లిదండ్రులకు తెలియకుండానే పిల్లలు వీటికి బానిసలుగా మారిపోతున్నారు. టీనేజీలో గ్రూపులుగా ఏర్పడి వివిధ మాధ్యమాల్లో వ్యసానాలకు బానిసలుగా మారిపోతున్నారు.

తల్లిదండ్రులే ఆదర్శం కావాలి...

తల్లిదండ్రుల రోజువారీ ప్రవర్తన పిల్లలపై ఎక్కువ ప్రభావితం చేస్తోంది. తల్లిదండ్రుల తమ పిల్లలను అతి గారబంగా పెంచకుండా సమాజహితానికి ఉపయోగపడే విషయాలు నేర్చుకునేలా తీర్చిదిద్దాలి. అనుబంధాల గొప్పదనాన్ని తెలపాలి. నైతిక విలువలకు నాంది పలికే అలవాట్లను ప్రోత్సాహించాలి. పిల్లలే ఎదుటే తండ్రి సిగరెట్ వెలిగించడం, మద్యం సేవించడం వంటివి చేస్తే వాటి ప్రభావం పిల్లల్లో కన్పిస్తోంది.

అడ్డుకట్ట వేయడం ఇలా...

పిల్లల మొబైల్‌ఫోన్, కంప్యూటర్‌లా వినియోగాన్ని తరచుగా గమనిస్తూ ఉండాలి. పిల్లల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి స్నేహితులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉండాలి. పిల్లలపై అతిజాగ్రత్తతో కాకుండా స్నేహితుల్లా తల్లిదండ్రులు మెలిగితే అన్ని విషయాలు వారితో పంచుకుంటారు. ఇంటర్‌నెట్ వినియోగించే సమయంలో తల్లిదండ్రుల పరివేక్షణ ఉండాలి.

మితిమీరిన ఇంటర్‌నెట్ వాడకం మంచిది కాదు



మారుతున్న పరిస్థితిలో విద్యార్థులు, యువత ఎక్కువ సమయం ఇంటర్‌నెట్ వినియోగించుకునే అవకాశం కలుగుతోంది. అలా మితిమీరిన వాడకం వల్ల మెదడు, గుండె, కంటి సంబంధ వ్యాధులకు గురయ్యే అవకాశాలున్నాయి. మొబైల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా వెలువడే రేడియేషన్ ప్రభావంతో కంటి చూపు, నిద్రలేమి, క్యాన్సర్, తదితర శారీరక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుంటాయి.

–డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి, ప్రముఖ వైద్యులు, నిర్మల్

సోషల్ మీడియా అడిక్షన్ పెరిగింది



ప్రధానంగా చిన్న పిల్లలు, విద్యార్థులు, యువత సోషల్ మీడియా, యుట్యూబ్ వంటి వాటికి బానిసలుగా మారిపోతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం ఒక కంట కనిపెడుతూ ఉండాలి. సగటున 60శాతానికి పైగా మానసిక సంబంధ కేసులు, అబ్‌నార్మల్ బిహేవియర్ కేసులు పెరిగిపోతున్నట్లు అధ్యయన నివేదికలు వెల్లడిస్తున్నాయి.

–డాక్టర్ మోత్కూరి రాంచందర్, కౌన్సిలింగ్ సైకాలజిస్టు

బాలుడి వైద్యానికి సాయం

- స్పందిస్తున్న దాతలు

సాక్షి స్పందన

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన సిదం నాగచైతన్య (14) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై తీవ్ర గాయాలతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు అవుతాయని వైద్యులు తెలుపడంతో ఆ నిరుపేద తల్లిదండ్రులు తమ కుమారుడిని కాపాడుకోవడానికి తల్లడిల్లుతున్నారు. దీంతో ఈ నెల 7న సాక్షిలో ×నా కొడుకుని కాపాడండి₹ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శుక్రవారం కడెం మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన మానవసేవ-మాదవ సేవ ఫౌండేషన్ సభ్యులు రూ.5000, మండల కేంద్రానికి చెందిన యువసేన యూత్ సభ్యులు రూ.5000, మంచిర్యాల జిల్లా భీమారం మండల తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ రూ.2000 ఆర్థిక సాయాన్ని అందించారు. బాలుడిని ఆదుకునేందుకు మరింతమంది దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మానవసేవ-మాదవసేవ సభ్యులు

రాష్ట్రస్థాయిలో పతకాల పంట



విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

- ఎస్జీఎఫ్ అథ్లెటిక్స్ ఈవెంట్లలో ప్రతిభ
- ఏడు పతకాలతో మెరిసిన జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన గిరి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల పంట పండించారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 14 పోటీల్లో అథ్లెటిక్స్ ఈవెంట్లలో ఐదు పతకాలతో మెరిశారు. జిల్లాలోని ఉట్నూర్ ప్రభుత్వ గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలకు చెందిన కె.పరశురాం 600 మీటర్ల ఈవెంట్లో, 400 మీటర్ల ఈవెంట్లో ఎస్కే. నగేష్ స్వర్ణ పతకాలతో విజేతలుగా నిలిచారు. ఇక 100 మీటర్ల రిలే పరుగు పందెంలో విక్రమ్, పరశురాం, కార్తీక్, లింగులు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ కొల్లగొట్టారు. లాంగ్ జంప్ ఈవెంట్లో జే. శ్రీకాంత్ రజత పతకం సాధించగా, 100 మీటర్ల పరుగు పందెంలో ఆర్. విక్రమ్, డిస్కస్ త్రోలో సతీష్ కుమార్‌లు కాంస్య పతకాలు సాధించాలని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. క్రీడాకారులు విజేతలుగా నిలవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



విజేతగా నిలిచిన బాలుర జట్టు

రాష్ట్రస్థాయిలో జిల్లా క్రికెట్ జట్టుకు కాంస్య పతకం

67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 17 బాయ్స్ క్రికెట్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా జట్టు కాంస్య పతకం సాధించి విజేతగా నిలిచింది. జోగులాంబ గద్వాలలో జరుగుతున్న ఈ పోటీల్లో శుక్రవారం సెమీఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో తృటిలో విజయం చేజారింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో మెదక్ జిల్లా జట్టుపై విజేతగా నిలిచిందని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

గ్రామ బహిష్కరణలో ముగ్గురికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: గ్రామ బహిష్కరణ కేసులో ముగ్గురికి నెల రోజుల జైలు, రూ.500 జరిమానా విధిస్తు ఆదిలాబాద్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి టి.దుర్గారాణి తీర్పునిచ్చారు. లైజన్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం రాజలింగు అనే వ్యక్తి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తనను గ్రామ బహిష్కరణ చేశారని పేర్కొంటూ 14 జూన్ 2017న లక్సెట్టిపేట్ సీఐకి ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి జన్నారం ఎస్సై ఎండీ.తహిషినోద్దీన్ గ్రామానికి చెందిన దుర్గం గంగాధర్, దుర్గం లక్ష్మినారాయణ, దుర్గం రాజలింగు, దుర్గం శంకరయ్యలపై కేసు నమోదు చేశారు. విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు డ్యూటీ అధికారి తాజుద్దీన్ సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ ఎం.నవీన్ కుమార్ తన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో దుర్గం గంగాధర్, దుర్గం లక్ష్మినారాయణ, దుర్గం రాజలింగులకు నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తు తీర్పునిచ్చారు.

నిప్పంటుకుని యువకుడి మృతి



రమేశ్ (ఫైల్)

నర్సాపూర్(జి): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కల్లూరు గ్రామానికి చెందిన కుంచపు రమేష్ (26) వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దినేష్ అనే ట్రాక్టర్ యజమాని వద్ద గత ఆరు నెలలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కల్లూరు గ్రామ శివారులోని పంట పొలంలో వరికుప్పలకు నిప్పటించి వరి కుప్పలను కాలుస్తున్న క్రమంలో పొగతో శ్వాస ఆడక కిందపడగా నిప్పు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటన స్థలంలో బంధువుల రోదనలు మిన్నంటాయి. తండ్రి లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామ సమీపంలోని వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం, ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బండి విజయ్ ద్విచక్ర వాహనంపై బెజ్జూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో డబ్బా గ్రామానికి చెందిన ఎద్దు రమేశ్ కాగజ్‌నగర్ నుంచి డబ్బా వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా, కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తుకారాం భార్య శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

భీమారం: మంచిర్యాల నుంచి చెన్నూర్‌కు కి రాణా సామగ్రితో వెళ్తున్న మారుతీ వ్యాన్ శుక్రవారం సాయంత్రం భీమారం మండలం పోలంపల్లి వద్ద జాతీయరహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్ డ్రై వర్ జబీర్‌కు గాయాలయ్యాయి. అతడిని చి కిత్స కోసం ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి ఊరుమందమర్రి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభించిందని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుమందమర్రి గ్రామస్తులకు అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25-30 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భద్రపర్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో తెలుపాలని సూచించారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య



నితిన్ (ఫైల్)

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రా మానికి చెందిన రా థోడ్ నితిన్ (20) ఆ త్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన ధరంసింగ్-అనసూయాబాయి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. రెండో కొడుకు నితిన్ కొంత కాలంగా సిర్పూర్(యూ) మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో దేవాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. వీరి ప్రేమ వ్యవహారం మరో ఇద్దరికి తెలియగా వారు నితిన్‌ను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నితిన్ సోమవారం దేవాపూర్‌లోని తన ఇంటి సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నలుగురు మిత్రులకు వాట్సాప్ మెసేజ్ చేసి పురుగుల మందు తాగాడు. వాట్సాప్ మెసేజ్ చూసిన నితిన్ మిత్రులు అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. కుటుంబీకులు వెంటనే నితిన్ వద్దకు చేరుకుని చికిత్స కోసం మొదట కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

యువతకు 'ఆమె' స్ఫూర్తిగా..



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో అధ్యాపకురాలు బాశెట్టి లత (ఫైల్)



పురస్కారాలతో లత (ఫైల్)

- వెనుకబడిన జిల్లా నుంచి వెనుదిరిగి చూడని స్థాయికి...
- లక్ష్యం దిశగా శ్రమించి ఉన్నతంగా ఎదిగి
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు
- అథ్లెటిక్స్‌లోనూ అందెవేసిన చేయి..
- సాహితీరంగంలోనూ సేవలు..
- పొందిన పురస్కారాలు, ప్రశంసాపత్రాలెన్నో..

నిర్మల్ ఖిల్లా: ఆమె దిగువ మధ్యతరగతి కుటుంబంలో నలుగురు ఆడపిల్లల మధ్యన జన్మించినా.. పట్టుదలతో శ్రమించింది. చదువుపై మక్కువతో నిరంతరం లక్ష్యం దిశగా గురిపెట్టింది. అనుకున్నది సాధించింది. ఉన్నత చదువుల్లోనూ ఔరా.. అనిపించింది. నిర్మల్ జిల్లాలోని మారుమూల ప్రాంతం నుంచి ఎదిగి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలోని కె.వి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన ×బాశెట్టి లత₹ ఎందరో నిరుద్యోగులకు స్ఫూర్తినిస్తోంది.

చదువుపై మక్కువతో..

నిర్మల్ జిల్లాలోని ముధోల్ మండలంలోని తరోడా ప్రాంతానికి చెందిన ×బాశెట్టి లత₹కు చిన్నప్పటి నుంచి చదువుపై మక్కువ. మొదట తెలుగులో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పూర్తిచేసుకుని ఎంఫిల్, పీహెచ్‌డీని కూడా పూర్తి చేసింది. అనంతరం జేఆర్ఎఫ్- నెట్, ఏపీసెట్ తదితర అర్హత పరీక్షలను కూడా సాధించింది. అక్కడితో ఆగిపోకుండా సంస్కృతం, ఆంగ్లంలోనూ ఎంఏ పూర్తి చేసింది. అధ్యాపకురాలుగా స్థిరపడాలనే లక్ష్యంతో ఆ దిశగా కృషి చేసింది. కష్టపడి చదివి విజయం సాధించింది. 2011 కడప జిల్లాలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగంలో చేరింది. ప్రస్తుతం కర్నూలు జిల్లా కేంద్రంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

సాధించిన విజయాలెన్నో...

బాశెట్టి లత గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే క్రీడల్లో శిక్షణ తీసుకోవడంతో పాటు అథ్లెటిక్స్‌లోనూ రాణిస్తూ ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. మరోవైపు అధ్యాపకురాలిగా వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును సైతం తీర్చిదిద్దుతోంది. విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య చదువుతున్న సమయంలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో పాటు పలు పతకాలను సొంతం చేసుకున్నారు. ఇదే స్ఫూర్తితో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉ ద్యోగంలో చేరిన తర్వాత మొదటి ప్రయత్నంలో భాగంగా నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. గత నెలలో నెల్లూరులో జరిగిన పైకి రన్నింగ్‌లోనూ వెండి పతకాన్ని సాధించారు. అండర్ 35 విభాగంలో నిర్వహించిన 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కోల్‌కతాలో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం గమనార్హం. ఆగస్టులో గ్రీన్ టింకర్స్ సొసైటీ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీ పురస్కారం లభించింది.

స్వర్ణ కంకణ పురస్కారం సైతం..

భాశెట్టి లత సాహితీరంగంలోనూ నైపుణ్యం కనబరుస్తోంది. ఈమె సాహితీరంగంలో చేస్తున్న సేవలకు జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో స్వర్ణ కంకణ పురస్కారం లభించింది. ఈ నెల 6న తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భాష సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ వి.ప్రభాకర్ భవాని, సాహితీ వేదిక అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఘన సత్కారాన్ని పొందింది.

నిరుద్యోగులకు స్ఫూర్తినిస్తూ...

భాషెట్టిలత తాను ఒకే పోస్టు గ్రాడ్యుయేషన్‌తో సరిపెట్టకుండా పీజీలో ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సంస్కృతం సైతం చదివి ఎంఫిల్, పీహెచ్‌డీలను పూర్తి చేసింది. 12 ఏళ్లుగా ఎందరో విద్యార్థిని విద్యార్థులను ఉన్నత చదువుల పట్ల ప్రేరణ కలిగిస్తున్నారు. ఇప్పటికే తాను గురజాడ సాహితీ పురస్కారం 2019లో, ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు 2020లో, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2021లో స్వీకరించారు. అదేవిధంగా 2022లో డైనమిక్ లీడర్‌షిప్ అవార్డును, జాతీయ ఉత్తమ మహిళా అధ్యాపకురాలు పురస్కారాన్ని సైతం అందుకున్నారు. 2021-22 సంవత్సరానికి అంతర్జాతీయ అవుట్ స్టాండింగ్ టీచర్ పురస్కారాన్ని కూడా పొందారు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే...



చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలు కష్టపడుతున్నతీరుని ప్రత్యక్షంగా చూస్తూ పెరిగాను. అన్నింటికీ సరైన పరిష్కారం చదువేనని గుర్తించాను. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేశాను. డిగ్రీ అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించి కడప జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాను. నా భర్త సాయికుమార్ తగిన సహకారం అందిస్తుండడంతో ఇటు గృహిణిగా, డిగ్రీ అధ్యాపకురాలిగా ఏకకాలంలో విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నాను.

– బాశెట్టిలత, అసిస్టెంట్ ప్రొఫెసర్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఆయుష్, హర్షవర్ధన్, సాయి చరణ్ అనే షూటింగ్ బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి అండర్ 17 షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ బిన్నికార్ అహ్లువాలియా తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని పలువురు ఆకాంక్షించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ హోటల్‌లో పేకాటాడుతున్న ఆరుగురిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ అశోక్ వివరాల ప్రకారం.. తమకు అందిన పక్కా సమాచారం మేరకు గురువారం రాత్రి హోటల్‌పై దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.93,980 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.